రైతులకు అండగా సహకార సంఘాలు

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సోమ్లాతండాలో సొసైటీ గోదాం, ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

సంగెం: సహకార సంఘాలు రైతులకు అండగా నిలుస్తాయని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సోమ్లాతండాలో కాపులకనిపర్తి సొసైటీ ఆధ్వర్యంలో రూ 18.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గోదాం, ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి సహకార వ్యవస్థ దోహదపడాలన్నారు. సహకార వ్యవస్థను పునర్నిర్మాణానికి చేయుతనందించడంతో పాటుగా స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుచేసి వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 90 శాతం సహకార సంఘాలు ఆర్థిక ఇబ్బందులతో నిర్వీర్యం అయ్యాయన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడిందని పార్టీలకతీతంగా రైతులకు, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో రైతాంగ సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. రైతుల పంటల ఉత్పత్తుల నిల్వకు అవసరమైన గోదాముల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో రైతు పొదుపు సంఘాల ఏర్పాటు చేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ దొమ్మాటి సంపత్‌గౌడ్, ఎంపీటీసీలు నర్సింహస్వామి, సంపత్‌రెడ్డి, బాలకృష్ణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రేఖా, సీఈఓ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించాలి

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా కృషి చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తీగరాజుపల్లిలో గ్రామపార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, కాంగ్రెస్ నాయకుడు సోమిడి అంజన్‌రావు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై రాసిన భగభగమండే సూర్యుడు పాట ఆడియోను ప్రకాష్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులకు అనేక సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాదవరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

● ఎంపీపీ జాటోతు రమేష్‌నాయక్
● మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్‌నాయక్

నెక్కొండ: వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ జాటోతు రమేష్‌నాయక్ అన్నారు. ఆయన అధ్యక్షతన బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకూడదని, వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు. గ్రామ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కాగా చివరి ఆయకట్టు పంటలకు సాగునీరందడం లేదని వైస్ ఎంపీపీ కర్పూరపు శ్రీనివాస్, చంద్రుగొండ ఎంపీటీసీ సంగని సూరయ్య అధికారుల దృష్టికి తీసుకవెళ్లారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో రైతులకు సాగునీటి కష్టాలుండేవి కావన్నారు. పదే పదే ఇదే విషయాన్ని ప్రస్తావించి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో రెడ్లవాడ ఎంపీటీసీ మాలోతు రవి అడ్డుపడ్డారు. రానున్న రోజుల్లో అటు సాగు, ఇటు తాగునీటి సమస్యలు తలెత్తకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేయనుందని పేర్కొన్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి వ్యక్తిగత విషయాలపై దూషణలకు దిగారు. విద్యుత్ శాఖ ఏఈ చిరంజీవి మాట్లాడుతూ మార్చి1 నుంచి అర్హులైన వినియోగదారులకు జీరో విద్యుత్ బిల్లు అమలవుతోందన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వినియోగదారులకు ఎప్పటి మాదిరిగానే బిల్లులు వస్తే ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ సునీల్, ఎస్సై మహేందర్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

నెక్కొండ: గత జనవరిలో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తులు ఇవ్వని లబ్ధిదారులు ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో దరఖాస్తులివ్వని లబ్ధి దారుల కు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. దరఖాస్తులు ప్రతి రోజు స్వీకరిస్తామన్నారు.

శేఖర్‌రావును కలిసిన కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట: కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియామకమైన నిమ్మాని శేఖర్‌రావును హన్మకొండలోని ఆయన స్వగృహంలో బుధవారం మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, సుధాకర్ ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌లో టెన్త్ ప్రశ్నపత్రాలు



చెన్నారావుపేట : పదో తరగతి వార్షిక పరీక్ష ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ప్రశ్నపత్రాలను ఎస్‌హెచ్‌ఓ కస్టోడియన్ అధికారి మనుపాటి పాపమ్మ, చంద్రమౌళి, వెంకట్రాం, నర్సయ్య, ప్రసన్నలక్ష్మి, రూట్ ఆఫీసర్ సారయ్య పరిశీలించారు. సీజ్ చేసి స్టేషన్‌లో భద్రపరిచారు.పోలెపల్లి రవి, సీఆర్పీలు బాలు, స్వామి, స్వర్ణలత ఉన్నారు.

11 నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

పర్వతగిరి: మండలంలోని కల్లెడలో శ్రీకొలను వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి కరపత్రాలను వారు ఆవిష్కరించారు. శ్రీదేవి భూదేవి లీలా సమేత శ్రీప్రసన్న కొలను వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 11న సోమవారం ఐదేళ్లలోపు పిల్లలకు ఆయుష్ హోమం, 14న వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్రగాయాలు

రాయపర్తి: టూవీలర్‌పై ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కొలన్‌పల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వర్ధన్నపేట మండలం గుబ్బెడుతండాకు చెందిన ఆంగోతు జగన్, ఆంగోతు దేవెల్లి టూవీలర్‌పై ఆరెగూడెంలో నిర్వహించిన దుర్గమ్మ పండగలో పాల్గొని తిరిగి తండాకు వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామశివారుకు రాగానే అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో జగన్‌కు స్వల్ప గాయాలు కాగా జగన్ తల్లి దేవెల్లికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

మండల సమాఖ్యలో మహిళా దినోత్సవం

దుగ్గొండి: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షురాలు లలిత కేక్ కట్ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ తన కాళ్లపై తాను నిలబడేలా ఆర్థికంగా ప్రగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజ్‌కుమార్, కార్యదర్శి రజిత, సావిత్రి, వెంకట్, బాబు, సంధ్యారాణి, అరుణ. రంజిత్, వివిధ గ్రామాల సంఘాల బాధ్యులు, వీఓఏలు పాల్గొన్నారు.

జీరో పవర్ బిల్లు ప్రారంభం



చెన్నారావుపేట: మండలంలోని పాపయ్యపేటలో బుధవారం జీరో పవర్ బిల్లును కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకంకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వమని, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీమీని నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కంచ ప్రభాకర్, నాయకులు ఉన్నారు.

వాగ్దానాన్ని తుంగలో తొక్కిన ప్రభుత్వం



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నర్సంపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ఉచితంగా భూమి క్రమబద్ధీకరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన వాగ్దానాన్ని తుంగలో తొక్కిందని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ అన్నారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి మునిసిపల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నామమాత్రపు ఫీజుతో ఎల్‌ఆర్‌ఎస్ కట్టి క్రమబద్ధీకరించుకోవాలని దరఖాస్తులు ఆహ్వానిస్తే 25 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. దీన్ని ఆనాడు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కోర్టులో కేసు వేసి ఆపారని తెలిపారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికభారం మోపుతూ 2024 మార్చి 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ కట్టాలని ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, కౌన్సిలర్లు నాగిశెట్టి పద్మప్రసాద్, దేవోజు తిరుమలసదానందం, గందె రజితచంద్రమౌళి, రామసహాయం శ్రీదేవిసుధాకర్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి వెనుముద్దల శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు రావుల సతీష్, బీరం నాగిరెడ్డి, యాదగిరి, చుక్క అనిల్, గంప రాజేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట



నర్సంపేట : మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి



వర్ధన్నపేట: ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న మహిళలు

నర్సంపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందని నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మన్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం నారీ శక్తివందన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ఏర్పాటు చేసి వివరించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఒక గిరిజన మహిళను రాష్ట్రపతి చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ప్రధానిగా మోదీని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రభారీ సత్యపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహారాములు, పార్లమెంటు కోకన్వీనర్ కట్ల రాంచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'నారీ శక్తివందన్'ను వీక్షించిన మహిళలు

గీసుకొండ: మండలంలోని మరియపురం శివారులోని ఎస్‌ఎస్ గార్డెన్స్‌లో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నారీ శక్తివందన్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు వీక్షించారు. పరకాల నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తొమ్మిదేళ్ల పాలనలో మహిళల అభ్యున్నతి కోసం చేపట్టిన అనేక సంక్షేమ పథలు, కార్యక్రమాలను ప్రధాని మోదీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వివరించగా ఆయన ప్రసంగాన్ని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలుగులో అనువదించి వివరించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బండారి కళ్యాణి, మండల అధ్యక్షురాలు కత్తి హేమలత, 16వ డివిజన్ అధ్యక్షురాలు సంధ్య, కర్ణకంటి రజిత, బీజేపీ మండల అధ్యక్షులు నిమ్మగడ్డ జాన్ విక్రం, సంగెం మండల అధ్యక్షులు బుట్టి కుమారస్వామి, 15వ డివిజన్ అధ్యక్షులు బిల్లా రమేశ్, పరకాల నియోజకవర్గ కన్వీనర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

వర్ధన్నపేట: పట్టణంలోని ఎంఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ప్రధాని మోదీ నారీశక్తి వందన్‌లో భాగంగా టీవీలో ప్రత్యక్ష ప్రసారంలో మాట్లాడుతున్న ఆయన ప్రసంగాన్ని బీజేపీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలు వీక్షించారు.కార్యక్రమంలో నాయకులు రాయపురం కుమారస్వామి, కొండేటి అనిత సత్యం, చీటూరి రాజు, పెద్దూరి రాజు, ఐత రవి, కొండేటి బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా : ఎర్రబెల్లి



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

రాయపర్తి: కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వారే నిజమైన కార్యకర్తలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికీ బీఆర్‌ఎస్ పటిష్టంగా ఉందన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలను కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు, మాజీ ఎంపీపీ నాగపురి రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కొండూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పోలినేని శ్యాంరావు నానమ్మ మృతిచెందింది. ఆయన కుటుంబ సభ్యులను బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మైలారంలో పోతర్ల ఉత్తరమ్మ మృతిచెందగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గరిబోళ్లకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

నర్సంపేట: ప్రజా పాలనలో గరిబోళ్లకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని మహాజన సోషలిస్టు ఉద్యమ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, డీబీడీపీఎస్ జాతీయ అధ్యక్షుడు అందె రవిలు డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌నగర్‌లో బుధవారం గరీబోళ్ల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ ధర్మప్రవక్త సంత్ గురు రవిదాస్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మలిదశ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ప్రశ్నించే గొంతులకు సంకెళ్లు వేసిందన్నారు. నర్సంపేట ప్రభుత్వ భూమి 813సర్వే నంబర్‌లో గూడులేని నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని, రెక్కాడితే డొక్కాడని గరీబోళ్లు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే మాధవరెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో గుంపుల మాలతిలత, మమత, బోయిని నారాయణ, జలగం రమేష్, డీబీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మునిగె యాకోబు, మాదాసి బాబు, దామెర సుధాకర్, సిద్దబోయిన సాంబయ్య, కత్తి రాములు, ఆరోగ్యమ్మ, సరోజన, రజాక్, ఉప్పన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నర్సంపేట: మండలంలోని చిన్నగురిజాలకు చెందిన వెంగళదాస్ కోటేశ్వర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు 1997–98 పదో తరగతి స్నేహితులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20వేలు, 50కిలోల బియ్యం అందజేసి మృతుని భార్య కవిత, కుమార్తె అక్షయకు తోడ్పాటును అందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో డాక్టర్ మోతె నవత, కొంపెల్లి లలిత, పాక సంగీత, పోశాల రజిత, చంద వసంత, బండారి ధనలక్ష్మి, అల్లి శ్రీను, బొమ్మగాని యాకయ్య, తదితరులు ఉన్నారు. వారి వెంట గొలనకొండ వేణు, పోతు రాంబాబు, కొత్త శ్రీను, మొగులోజు రాజు, వెంగళదాస్ రాజేందర్, ముత్యాల సతీష్, మర్రి రాంబాబు, పాషా, సర్వేశం, దొడు రాంబాబు ఉన్నారు.

ప్రపంచ విజ్ఞాన గని భారత్

● కేయూ ప్రొఫెసర్ సీహెచ్.సంజీవరెడ్డి



అతిథులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నర్సంపేట : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని కేయూ ప్రొఫెసర్ సీహెచ్.సంజీవరెడ్డి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ విభాగాలు, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్(టాస్) సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ సమస్యలు, పరిష్కారాలు అంశంపై ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. భారతదేశం ప్రాచీన కాలం నుంచి ప్రపంచానికి విజ్ఞాన గనిగా ఉందని తెలిపారు. విజ్ఞాన శాస్త్రంలో ఉపయోగపడే అనేక విషయాలు భారతీయులు కనుగొన్నారని వివరించారు. వైద్య రంగం, సాఫ్ట్‌వేర్ రంగంలో భారతీయులు ముందంజలో ఉన్న భారతీయులు ఇంకా ప్రగతి సాధించాలని సూచించారు. నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ మానవ మనుగడకు సవాలుగా మారుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులు 42 పరిశోధన పత్రాలను సమర్పించారని సదస్సు కన్వీనర్ డాక్టర్ లకన్‌సింగ్ తెలిపారు. కళాశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం అతిథులను సన్మానించారు. సదస్సులో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనాథ్, తోట రమేష్, జి.ప్రసూన, ఎం.నరేందర్, పి.త్యాగయ్య, వి.పూర్ణచందర్, బి.విష్ణుకుమార్, ఐ.శివనాగశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఇంద్రదేవ్

నర్సంపేట: రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే యూత్ కాంగ్రెస్ లక్ష్యమని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుల మతాల మధ్య గొడవలు సృష్టిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందన్నారు. మతతత్వ రాజకీయాలు చేస్తూ యువతను మోసం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చెన్నారావుపేట మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ మోడెం ఎల్లగౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రూపిక శ్రావణ్‌కుమార్, కీసర అజయ్‌కుమార్, శంకరం తండా గ్రామపార్టీ అధ్యక్షులు హనుమాన్‌నాయక్, ఖానాపురం మండల వైస్ ప్రెసిడెంట్ పల్స ప్రశాంత్, మహ్మద్ నజీర్, శంకర్, మహేష్, మురారి, సాయిపటేల్, రాహుల్, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీఐలను కలిసిన కాంగ్రెస్ నాయకులు



నర్సంపేట : టౌన్ సీఐని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



గీసుకొండ: సీఐ బాబూలాల్‌ను కలిసిన ఎస్సై జానీపాషా



ఖానాపురం : ఎస్సైని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సంపేట: నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి, రూరల్ సీఐ రాజగోపాల్‌లు ఇటీవల బాధ్యతలు స్వీకరించగా బుధవారం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్, నాయకులు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఐలను కలిసిన వారిలో తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ మోడెం మల్లాగౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రూపిక శ్రావణ్‌కుమార్, కీసరి అజయ్‌కుమార్, ఖానాపురం మండలం యూత్ వైస్ ప్రెసిడెంట్ పల్స ప్రశాంత్, మహ్మద్ నజీర్, శంకర్, మహేష్, మురారి, సాయిపటేల్, రాహుల్, రాంప్రసాద్, తదితరులు ఉన్నారు.

ఎస్సైని కలిసిన ఆటో యూనియన్ నేతలు

సంగెం: ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎల్. వెంకన్నను మండల టాటా మ్యాజిక్ ఆటో యూనియన్ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఎస్సైకి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు కడ్దూరి సురేందర్ పాశం రాజు పాల్గొన్నారు.

గీసుకొండ ఎస్సైగా జానీపాషా

గీసుకొండ: గీసుకొండ ఎస్సైగా షేక్ జానీ పాషా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెక్కొండ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా ఇన్‌స్పెక్టర్ బాబూలాల్‌ను కలిశారు.

ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఖానాపురం: నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్సై రఘుపతిని కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలు అందజేసి సన్మానించారు. ఎస్సైని కలిసిన వారిలో ఎర్ల భిక్షంరెడ్డి, వెంకటప్రసాదరావు, బొబ్బ విద్యాసాగర్, ముకేష్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి: విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని చింతనెక్కొండ గ్రామ రైతులు డిమాండ్ చేశారు. చింతనెక్కొండలో బుధవారం వారు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సారెస్పీ కాలువపై ఎస్ఎస్ 9 ట్రాన్స్‌ఫార్మర్‌పై సుమారు 28 మంది రైతులకు చెందిన మోటార్లు నడుస్తున్నాయని తెలిపారు. రైతులకు తెలియకుండా విద్యుత్ అధికారుల సహకారంతో ఒక వ్యక్తి అక్రమంగా లైన్ తీశాడని పేర్కొన్నారు. దీంతో ఓవర్ లోడ్ కారణంగా తమ మోటార్లు కాలిపోతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులంతా కలిసి ఆ వ్యక్తికి చెందిన లైన్ తొలగించడంతో సదరు వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో తమపైన ఫిర్యాదు చేశారని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు కిషన్‌రావు,మేష్, ప్రభాకర్, భూపాల్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన జీపీ ట్రాక్టర్



దుగ్గొండి: ప్రమాదవశాత్తు అదపు తప్పి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. జీపీ ట్రా క్టర్ ఉదయం చెత్తను సేకరించి దానిని డంప్ చేసిన అనంతరం తిరిగి వస్తుండగా డ్రైవర్ అజాగ్రత్త వల్ల కాలువలోకి దూసుకెళ్లింది. అయితే అక్కడ పెద్ద బండరాయి అడ్డురావడంతో ట్రాక్టర్ ఆగిపోయి ప్రమాదం తప్పింది. పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి ఫిట్‌నెస్ లేకపోయినా, డ్రైవింగ్ రాకున్నా ఇష్టారీతిన నడుపుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కార్మికుల కు శి క్షణ ఇ చ్చి ప్ర మాదా లు జరగకుండా చూ డాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజీనామా

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ గుడిపెల్లి ధర్మారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేశానని అందుకు ప్రతిఫలంగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. ఇందుకు గాను పెద్దికి రుణపడి ఉంటానన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు సొసైటీ చైర్మన్‌గా ఉండి అవినీతికి పాల్పడటాన్ని తాను సహించలేక జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. అవినీతిపై ప్రశ్నిస్తే నన్ను డబ్బుల కోసం డిమాండ్ చేస్తున్నాడని అసత్య ప్రచారాలు చేయడంతో కలత చెందానన్నారు. సొసైటీ పరిరక్షణ కోసం రైతుల పక్షాన ఉండి పోరాటం చేయడానికి తాను బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్లు ప్రకటించారు.